## 'ఓపెన్' సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 11: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో నిర్వహించిన ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఎస్ఎస్‌సీలో సంగారెడ్డి జిల్లా 64.14 ఉత్తీర్ణత సాధించగా మెదక్ జిల్లా 54.10 శాతం, సిద్దిపేట 51.16 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇంటర్మీడియట్‌కు సంబంధించి సంగారెడ్డి జిల్లా 47.81 ఉత్తీర్ణత సాధించగా మెదక్ 64.25 శాతం, సిద్దిపేట 50.93 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఫలితాలను www.telanganaopenschool.orgలో పొందవచ్చని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. మెమోల్లో తప్పుల సవరణకు ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. అభ్యాసకులు రీకౌంటింగ్ కోసం సబ్జెక్టుకు ఎస్ఎస్‌సీకి రూ.350, ఇంటర్మీడియట్‌కు రూ.400 చొప్పున, రీవెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు ఎస్ఎస్‌సీకి రూ.1200, ఇంటర్మీడియట్‌కు రూ.1,200 మీసేవా, టీఎస్ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 14 నుంచి 20లోగా చెల్లించాలన్నారు. వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కోర్డినేటర్ ఎస్ వెంకటస్వామిని(8008403635) సంప్రదించాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జహీరాబాద్, నవంబర్ 11: జహీరాబాద్ పట్టణంలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మరమ్మతులు చేపట్టనున్నట్లు జహీరాబాద్ సబ్ డివిజన్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనుండడంతో జహీరాబాద్, న్యాల్‌కల్, ఝరాసంగం, రాయికోడ్ మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుండడంతో ఆయా మండలాలకు చెందిన వినియోగదారులు సహకరించాలని కోరారు.

## జిన్నారంలో సదర్

జిన్నారం, నవంబర్ 11: మండల కేంద్రం జిన్నారంలో ఆదివారం రాత్రి సదర్ ఘనంగా జరిగింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి యాదవులు దున్నపోతులతో ఊరేగింపుగా వచ్చారు. వాటితో విన్యాసాలు చేయించారు. జిన్నారం, పెద్దమ్మగూడెం, నల్తె గూడెం గ్రామాల ప్రజలు సదర్ ఉత్సవాన్ని వీక్షించేందుకు భారీగా హాజరయ్యారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు పలువురు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

హత్నూర, నవంబర్ 11: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని హత్నూర మండలం సిరిపుర మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్ అన్నారు. సిరిపుర ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న హరిప్రసాద్, కాళేనాగేశ్వరి జాతీయస్థాయి కుంగ్‌ఫూ ఉష్ క్రీడాపోటీలకు ఎంపికవ్వడంతో సోమవారం వారిని సన్మానించారు. డిసెంబర్‌లో ఢిల్లీ, పంజాబ్‌లో జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో వీరు పాల్గొనున్నట్లు కుంగ్‌ఫూ ఉష్ ఉమ్మడిజిల్లా ప్రధాన కార్యదర్శి, గ్రాండ్‌మాస్టర్ పోచయ్య తెలిపారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 11: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాణించారు. హైదరాబాద్ కుల్సుంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో వివిధ కేటగిరీల్లో ఉమ్మడి జిల్లాకు ఒక గోల్డ్‌మెడల్, ఆరు సిల్వర్, ఐదు బ్రాంజ్ మెడల్స్ లభించాయి. ఈ పోటీల్లో మొత్తం 12 మెడల్స్‌తో ఉమ్మడి జిల్లా రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను, కోచ్ జైపాల్‌నాయక్, పీడీలను డీఈవో వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అమూల్యమ్మ అభినందించారు. కొంపల్లి సన్ ఫ్లవర్ వేదిక్ స్కూల్‌లో ఈ నెల 8 నుంచి 10 వరకు జరిగిన అండర్ -14 రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో రాణించిన బాస్కెట్ బాల్ క్రీడాకారులు, కోచ్ లక్ష్మణ్‌ను డీఈవో వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అమూల్యమ్మ, పీడీ వీబీ శ్రీనివాస్, పీడీలు, పీఈటీలు అభినందించారు.

## వీర శైవ లింగాయత్ కోశాధికారిగా సంతోష్‌కుమార్

పుల్కల్, నవంబర్ 11: వీరశైవ లింగాయత్ జిల్లా కోశాధికారిగా పోలీస్ సంతోష్ ఎన్నికయ్యారు. జహీరాబాద్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన పోలీస్ సంతోష్‌కుమార్ వీర శైవ లింగాయత్‌ల సంక్షేమానికి చేస్తున్న సేవలు, సంక్షేమాన్ని గుర్తించి జిల్లా కార్యవర్గంలోకి తీసుకున్నారు. సంతోష్‌కుమార్ గతంలో జిల్లా ఉపాధ్యక్షుడిగా, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీర శైవ లింగాయత్ సమాజం కోసం పని చేస్తానన్నారు.

# ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

సంగారెడ్డి కలెక్టరేట్: ఆజాద్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

జహీరాబాద్: ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 11: భారతరత్న, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి డీఆర్వో పద్మజారాణి, వివిధ శాఖల అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ భారత విద్యాశాఖ మంత్రిగా కలాం విద్యా వ్యవస్థకు పునాదులు వేశారన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి దేవజా, డీఈవో వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ గీత, యువజన సంక్షేమ శాఖ అధికారి ఖాసీం బేగ్ పాల్గొన్నారు.

***బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..***

జహీరాబాద్, నవంబర్ 11: భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని జరుపుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆదేశాల మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, పీఎసీఎస్ చైర్మన్ మచ్చేందర్, నాయకలు నామరవికిరణ్, బండి మోహన్, యాకుబ్, సురేశ్, శివప్ప, చిన్నారెడ్డి, సయ్యద్, అజీమొద్దీన్, దీపక్, లక్ష్మీకాంత్, వెంకట్, సాగర్, లవన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

ముదిమాణిక్యంలో పాలీహౌస్ ఆర్కిడ్ పూల సాగును పరిశీలిస్తున్న విద్యార్థులు

పుల్కల్, నవంబర్ 11: వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా అగ్రికల్చర్‌పై అవగాహన కల్పించేందుకు సోమవారం ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ఫీల్డ్ విజిట్ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కళ్యాణ చక్రవర్తి సూచన మేరకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వ్యవసాయానికి సాగు నీరు ఎలా అందిస్తారనే దానిపై మండల పరిధిలోని సింగూరు లిఫ్ట్ ఇరిగేషన్‌ను సందర్శించారు. అనంతరం పెద్దారెడ్డిపేట శివారులోని మిషన్ భగీరథను సందర్శించి నీటిని ఎలా శుద్ధికరణను పరిశీలించారు. అక్కడి నుంచి ముదిమాణిక్యంలోని పాలీహౌస్‌ను సందర్శించి ఆర్కిడ్ పూల సాగును పరిశీలించారు. విద్యార్థులకు చదువుతోపాటు వృత్తి విద్యలో భాగంగా వివిధ రకాల సూక్ష్మ నైపుణ్యాలపై మరింత అవగాహన పొందడం కోసమే విద్యార్థులను ఫీల్డ్ విజిట్‌కు తీసుకువెళ్లినట్లు ఉపాధ్యాయురాలు జ్యోతి విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నుషరత్, పీఈటీ సురేశ్ పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన ఉండాలి

మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 11: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్ పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డిలోని సేయింట్ ఆంథోనీస్ జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్జి రమేశ్ పలు రకాల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోస్కో, వరకట్న నిషేధ చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు.

## కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధికారులు

జహీరాబాద్, నవంబర్ 11: వికారాబాద్ కలెక్టర్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని న్యాల్‌కల్ మండల తహసీల్దార్ భూపాల్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టర్‌పై జరిగిన దాడి పట్ల సోమవారం తహసీల్ కార్యాలయ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కలెక్టర్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యాంరావు ఉన్నారు.

## తప్పుల్లేకుండా వివరాలు నమోదు చేయాలి

చౌటకూర్, నవంబర్ 11: ధాన్యం సేకరణలో తప్పులు దొర్లకుండా వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి తెలిపారు. మండలంలోని వెంకటకిష్టాపూర్, వెండికోలు, ఉప్పరిగూడెం, బొమ్మారెడ్డిగూడెం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆమె సందర్శించారు. ధాన్యాన్ని వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. డీపీఎంలు తల్వార్ మల్లేశం, జయశ్రీ, ఏపీఎం శివలక్ష్మీ ఉన్నారు.

## ఆకట్టుకున్న సదర్

జహీరాబాద్, నవంబర్ 11: మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో సదర్ ఉత్సవాలు ఆకట్టుకున్నాయి. గ్రామానికి చెందిన గొల్లకుర్మ యాదవ సంఘం నాయకులు పాండు యాదవ్, దత్తు యాదవ్ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో సదర్ ఉత్సవాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలకు మండలంలోని గ్రామాలతోపాటు పలు ప్రాంతాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు, యాదవ సంఘం నాయకులు, కులస్తులు పెద్ద ఎత్తున్న హాజరయ్యారు. డీజే చప్పుళ్లు, యాదవుల ఆటపాటల మధ్య అందంగా అలకరించిన భారీ దున్నపోతలతో గ్రామంలో వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

## పంచాయతీగానే కొనసాగించాలి

కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న గడ్డపోతారం గ్రామస్తులు

జిన్నారం, నవంబర్ 11: గడ్డపోతారం గ్రామాన్ని గ్రామ పంచాయతీగానే కొనసాగించాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గడ్డపోతారం మున్సిపల్‌గా మారబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయని, తమ గ్రామం పంచాయతీగానే కొనసాగాలని కోరారు. గ్రామంలో పరిశ్రమలు ఏర్పడడంతో వ్యవసాయం పూర్తిగా మరుగునపడిందని, గ్రామస్తులు పరిశ్రమల్లో వివిధ రకాల పనులతో ఉపాధి పొందుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. గడ్డపోతారం మున్సిపాలిటీగా ఏర్పడితే పన్నులు కట్టలేమని, ఇండ్లు కూడా నిర్మించుకోలేని పరిస్థితులు ఏర్పడుతాయని గ్రామస్తులు వేడుకున్నారు. అన్ని సమస్యలను, ప్రజల పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని తమ గ్రామాన్ని పంచాయతీగానే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నారబోయిన శ్రీనివాస్, బాలయ్య, సత్యనారాయణ, నాగరాజు, శ్రీరాములు ఉన్నారు.

## రోడ్డుపై చెత్త వేసిన వ్యక్తికి జరిమానా

జరిమానా రసీదును అందిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్

బొల్లారం, నవంబర్ 11: రోడ్డుపై చెత్త వేసిన వ్యక్తికి బొల్లారం మున్సిపాలిటీ అధికారులు జరిమానా విధించారు. న్యూ బస్టాండ్ సమీపంలో స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్న యజమాని రోడ్డుపై చెత్త వేశారని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడాన్ని హెచ్చరిస్తూ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు యజమానికి రూ.1,000 జరిమానా విధించారు. స్వచ్ఛతకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

గోవింద్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, నవంబర్ 11: మండల పరిధిలోని మెలిగిరిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మైలారం గోవింద్‌రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఆరిఫొద్దీన్, సీపీసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మంజులాహన్మంత్‌రెడ్డి, కార్యకర్తలు వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్, అంజనేయులు, మల్లేశం పాల్గొన్నారు.

## ఆపరేటర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా అనిల్‌చారి

రాయికోడ్, నవంబర్ 11: సమగ్ర శిక్షా-డాటా ఎంట్రీ ఆపరేటర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మండల పరిధిలోని సింగితం గ్రామానికి చెందిన అనిల్‌చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని నాంపల్లి టీజీఓ భవన్‌లో సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాయికోడ్‌లోని ఎమ్మార్సీలో పని చేస్తున్న జిల్లాకు చెందిన అనిల్‌చారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆపరేటర్లను పూర్తిస్థాయి ఉద్యోగులుగా గుర్తిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారన్నారు. ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామన్నారు.

## ఆలయ అభివృద్ధికి విరాళం

విరాళం అందజేస్తున్న జగదీశ్వర్‌పాటిల్

రాయికోడ్, నవంబర్ 11: మండల కేంద్రమైన రాయికోడ్‌లో ఉన్న శ్రీవీరభద్రేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి తన వంతు సహాయంగా మునిపల్లి మండల పరిధిలోని ఎల్లారం గ్రామానికి చెందిన చిట్లా జగదీశ్వర్ పాటిల్ రూ.25 వేలు అందజేశారు. సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని శ్రీవీరభద్రేశ్వస్వామి ఆలయంలో వారి దపంతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలయం అభివృద్ధికి తనవంతుగా ప్రతి సంవత్సరం తప్పకుండా ఆర్థికసహాయం అందిస్తామన్నారు. నిధులను అన్న ప్రసాదానికి వినియోగించుకోవాలన్నారు. వారిని ఆలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సిబ్బంది కృష్ణ, రాఘునాథ్ పూజారులు వీరేశంస్వామి, బస్వరాజుస్వామి, మల్లికార్జున్‌స్వామి, రుద్రయ్యస్వామి ఉన్నారు.

# ఆలయంలో కార్తిక దీపోత్సవం

గుమ్మడిదల: వీరభద్రస్వామిదేవాలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

కోహీర్: శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

గుమ్మడిదల, నవంబర్ 11: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని శైవక్షేత్రాల్లో భక్తులు కార్తికదీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం మండలంలోని వీరన్నగూడెంలోని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ సంఖ్యంలో భక్తులు దైవదర్శనాలు చేసుకున్నారు. ఎంపీడీవో ఉమాదేవి, సీఐ సుధీర్‌కుమార్, జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి దంపతులతోపాటు పలువురు ప్రముఖ నాయకులు వీరభద్రస్వామివారికి అభిషేకాలు చేశారు. ఈవో శశిధర్‌గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య అన్ని సౌకర్యాలు కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

**సంగమేశ్వరాలయంలో కార్తిక పూజలు**

కోహీర్, నవంబర్ 11: మండలంలోని కవేలి గిరిజా సమేత మహాలింగ సంగమేశ్వరాలయంలో కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకొని శివలింగానికి రుద్రాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

రాయికోడ్, నవంబర్ 11: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగ్వార్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తొమ్మిది మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.3.45 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మైరుగైన గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్నపాటిల్, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, కేదారినాథ్‌పాటిల్, ఏసయ్య పాల్గొన్నారు.

## పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే..

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

జహీరాబాద్, నవంబర్ 11: పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, సీపీఐతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ఆ పార్టీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణ సమీపంలోని ఏషియన్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భారతీయ కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 100వ వార్షికోత్సవ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నాటికి సీపీఐ వందేళ్ల వసంతంలోకి అడుగుపెడుతుందన్నారు. తమ పార్టీ ఎన్నో ఆటుపోట్లను చూసిందన్నారు. ఈ నాటికీ కమ్యూనిస్టుల అవసరం ఉందని, ప్రజలు ఆదరణ చూపిస్తున్నారని చెప్పారు. కేంద్రంలో 400 సీట్లు గెలుస్తామని చెప్పి మోదీ తెల్లముఖం వేశారని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. పేద ప్రజల సమస్యల సాధన కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఈటీ నర్సింహ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రకాశ్ రావు, జిల్లా కార్యదర్శి జలాలోద్దీన్, డివిజన్ కార్యదర్శి నర్సింహులు పాల్గొన్నారు.

## తెలిసినవాడే కదా అని చేరదీస్తే..

వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్‌కుమార్

అందోల్, నవంబర్ 11: అన్నం పెట్టిన ఇంటికే కన్నం పెట్టాడు ఓ ప్రబుద్ధుడు. తెలిసిన వాడే కదా అని చేరదీస్తే ఇంటి పెద్దావిడ బంగారంపై కన్నేసి కటకటాల పాలయ్యాడు. అక్టోబర్‌లో జరిగిన చోరీ మండలంలో చర్చనీయశం కాగా ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ మేరకు వట్‌పల్లి ఎస్సై విఠల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మండలంలోని పల్వట్ల గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి వ్యాపారం నిమిత్తం బీదర్‌లో ఉంటుండగా.. ఆయన తల్లి సునంద పల్వట్లలో ఉంటుంది. వెంకట్‌రెడ్డి వద్ద డ్రైవర్‌గా పనిచేసే బీదర్‌కు చెందిన మహిపాల్‌రెడ్డి చెడు వ్యసనాలకు అలవాటు పడి మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి చోరీకి ప్లాన్ చేశాడు. పల్వట్లలో వెంకట్‌రెడ్డి తల్లి సునంద ఒక్కతే ఉన్న విషయం తెలుసుకొని మహిపాల్‌రెడ్డి మరో ఇద్దరు మోసీన్, సోహైల్‌తో కలిసి రాత్రి సమయంలో ఇంటికి వచ్చాడు. సోయ తీయడానికి వచ్చామని, సోయ మిషన్ డ్రైవర్ మోహన్ పంపించాడని చెప్పి డోర్ తీయమని అడగంతో సునంద డోర్ తీసింది. వెంటనే ఇంట్లోకి వెళ్లిన ముగ్గురు సునందను కట్టేసి ఒంటిపై ఉన్న బంగారం తీసుకుని పారిపోయారు. ఉదయం విషయం కొడుకుకు చెప్పడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వట్‌పల్లి పోలీసులు కేసు నమోచేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో వెంకట్‌రెడ్డి డ్రైవరే చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించిన పోలీసులు నిందితుడిపై నిఘ పెట్టారు. సోమవారం బీదర్‌లో మహిపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు మోసీన్, సోహైల్ పరారీలో ఉన్నారని తెలిపారు. నాలుగు తులాల బంగారం రికవరీ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. నిందితుడికి గతంలో నేర చరిత్ర ఉన్నదని, పదికి పైగా కేసులున్నాయని తెలిపారు. సిబ్బంది పండిత్, సుందర్‌రాజ్ ఉన్నారు.

## అంతరాష్ట్ర దొంగ అరెస్టు

జిన్నారం, నవంబర్ 11: తాళం వేసిన ఇండ్లను లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగను గుమ్మడిదల పోలీసులు పట్టుకున్నారు. వారం క్రితం గుమ్మడిదలలో రెండు ఇండ్లలో దొంగతనం జరిగింది. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్లు మున్యా నాయక్, కిషోర్, కానిస్టేబుల్ కిశోర్ టీమ్‌గా ఏర్పడి వారంలోనే నిందితుడిని పట్టుకున్నారు. జిన్నారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సీఐ సుధీర్‌కుమార్ వివరాలు వెల్లడించారు. వరంగల్‌కు చెందిన హమీద్ సయ్యద్ అలియాస్ అహ్మద్ 1998 నుంచి చోరీలు చేస్తున్నాడు. ఇతడిపై హైదరాబాద్, సైబరాబాద్, రాజకొండ కమిషనరేట్‌లతోపాటు ఆదిలాబాద్, సంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, సిద్దిపేట, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో 150కి పైగా కేసులు నమోదయ్యాయి. ఈనెల 3న గుమ్మడిదల గ్రామానికి చెందిన చిమ్ముల రవీందర్‌రెడ్డి ఇంటి తాళం పగులగొట్టి 30 తులాల బంగారం అపహరించాడు. దాన్ని చార్మినార్‌లోని ఓ దుకాణంలో కరిగించి బంగారం దుకాణంలో ఇచ్చి 24 క్యారెట్ల బంగారం బిస్కెట్ తీసుకున్నాడు. సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని పట్టుకొని 10 గ్రాముల బంగారు బెస్కెట్‌ను స్వాదీనం చేసుకున్నారు. గుమ్మడిదలలో జరిగిన చోరీని సవాల్‌గా తీసుకొని 150 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి నిందితుడిని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. వారంలోనే నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ, పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

## చైన్ స్నాచర్లకు జైలు

రామచంద్రాపురం, నవంబర్ 11: చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని ఎల్‌బీనగర్ కోర్టు జైలు శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్సీపురం డివిజన్‌లోని హెచ్ఐజీలో 25 జూలై 2022లో ఓ మహిళా నుంచి బంగారు గొలుసుని లాక్కెళ్లిన ఘటనలో ఏ1గా ఇషాన్ నిరంజన్‌కి ఏడాది జైలు, రూ.1,000 జరిమానా, 26 జూలై 2022 ఏ1 ఇషాన్ నిరంజన్, ఏ2 రాహుల్ గచ్చిబౌలి, కూకట్‌పల్లిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడారు. హెచ్ఐజీ వైపునకు వస్తున్న ఆ ఇద్దరిని గస్తీలో ఉన్న పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేయగా సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ యాదయ్యపై కత్తితో పొడిచి పారిపోయే ప్రయత్నం చేశారు. అయినా ఆ కానిస్టేబుల్‌తోపాటు పోలీసులు ఆ స్నాచర్లను పట్టుకొని అరెస్టు చేశారు. ఈ కేసు మొదట సంగారెడ్డి కోర్టులో కొనసాగగా నేరస్తుల పిటిషన్ దాఖలు మేరకు ఎల్‌బీనగర్ కోర్టుకి షిఫ్ట్ చేశారు. కేసులో అప్పటి ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ పక్కా ఆధారులు కోర్టుకి సమర్పించడంతో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సీ.రాము, కస్తూరిబాయ్, నరేశ్ కేసుని వాధించారు. ప్రిన్సిపల్ జిల్లా జడ్జీ శశిధర్‌రెడ్డి వాదోపవాదాలు విన్న తర్వాత ఇద్దరు నేరస్తులకు ఏడేండ్ల జైలు, ఇద్దరికి చెరో రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో కోర్టు కానిస్టేబుల్ శ్రీను, సమన్ కానిస్టేబుల్ మహేందర్, లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ పనిచేశారు.

## మద్యం పట్టివేత

జహీరాబాద్, నవంబర్ 11: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని జిల్లా ఎక్సైజ్ టాక్స్‌ఫోర్సు, జహీరాబాద్ ఎక్సైజ్ శాఖాధికారులు పట్టుకున్నారు. సోమవారం నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలం మాడ్గి శివారులోని 65వ జాతీయ రహదారిపై ఉన్న చెక్‌పోస్టు వద్ద జిల్లా ఎక్సైజ్ టాక్స్‌ఫోర్సు, జహీరాబాద్ ఎక్సైజ్ శాఖాధికారులు, సిబ్బంది కలిసి ముంబాయి, గోవా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న బస్సులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఆయా ప్రాంతాల నుంచి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న వివిధ రకాలకు చెందిన 10.75 లీటర్ల ఎన్‌డీపీ (గోవా) మద్యాన్ని స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెక్‌పోస్టు ఎక్సైజ్ సీఐ మల్లికార్జున్‌జోషి తెలిపారు. ఎక్సైజ్ సీఐ హనుమంతు, ఎస్ఐలు రమేశ్, ఉషరాణి పాల్గొన్నారు.

## ఓపెన్ డ్రైన్‌లో పడి పారిశుధ్య కార్మికుడు మృతి

బొల్లారం, నవంబర్ 11: ఓ పారిశుధ్య కార్మికుడు ఓపెన్ డ్రైన్లో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. బొల్లారం మున్సిపాలిటీలో లంబాడి నరసింహ(35) ఏండ్లుగా పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 12:50 గంటలకు 17వ వార్డు బాలాజీ నగర్ చిత్తారమ్మ ఆలయ సమీపంలోని ఓపెన్ డ్రైన్‌లో పోగైన చెత్తాచెదారాన్ని తొలిగించేందుకు దిగాడు. కాగా, అప్పటికే అతడు మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. చెత్త తొలిగించేందుకు లోనికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఇరుక్కుపోయి మృతి చెందాడు. పనికి వెళ్లిన భర్త తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికారు. ఎక్కడైతే పని చేశాడో అక్కడికి వెళ్లి చూడగా చెప్పులు, షర్టు కనిపించాయి. వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. ఓపెన్ డ్రైన్‌లో పడి ఉన్న మృతదేహన్ని బయటకు తీశారు. పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మునిపల్లి, నవంబర్ 11: మండల పరిధిలోని కంకోల్ గ్రామ శివారులోని ముంబాయి జాతీయ రహదారి పక్క పొలంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రాజేశ్‌నాయక్ తెలిపారు. కంకోల్ శివారులో హైవే పక్కన ఓ రైతు పొలం లో గుర్తు తెలియని మృతదేహం కనిపించడంతో స్థానికులు మునిపల్లి పోలీసులకు స మాచారం ఇచ్చారు. స్పందించిన మునిపల్లి ఎస్సై తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆ వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో మృతదేహన్ని సదాశివపేట ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపరిచారు. ఎవరైనా గుర్తిస్తే మునిపల్లి పోలీస్‌స్టేషన్(87126 56749)లో సంప్రదించాలని సూచించారు.